రెంటికీ చెడ్డ
రేవడి కథలా
అతడు తన
సైకిల్ కోల్పోయాడా?

# అమాయకపు పక్షి

మంత్రవాది
మహేశ్వర్
కథ

సెకెండ్ షో వదిలేటప్పటికి పదకొండున్నర దాటుతోంది. బయటసన్నగా చినుకులు పడుతున్నాయి. సినిమా విడుదలై రెండురోజులే అయింది. పైగా సెలవురోజు కావడం చేత జనం బాగా వున్నారు. అందర్నీ దాటుకుంటూ సైకిల్ స్టాండు, దగ్గరికొచ్చాను. అక్కడ జనం... సైకిళ్ళు ఒకదాని మీద ఒకటి ఆన్చి వున్నాయి. నా సైకిలు ఎక్కడుందో నా టోకెన్ నెంబరు పేర్చిన.ప్పుడు, నేను లేకపోయినా ప్రక్కన వుంచుతాడని కాస్త అలా కెళ్ళికొట్టుకెళ్ళాను. అక్కడో మిత్రుడు కనబడడం, కాసేపు మాట్లాడడం... ఓ పావుగంట దాటిపోయింది. సైకిల్ అంతగా అలవాటులేని నేను మరచిపోయి ఓ నాలుగడుగులువేసి చేతిలోవున్న టోకెను చూసుకుని గుర్తొచ్చి స్టాండుకెళ్ళాను— అప్పటికే అంతా వెళ్ళిపోయారు... నా సైకిలొకటేవుంది.

"ఏవిటి సార్... ఎక్కడికి పోయారు ఇంతసేపు" అని టోకెన్ తీసుకుంటూ విసుక్కున్నాడు.

వర్షం కాస్త పెద్దదయ్యేలా అనిపించింది. రివ్వున రావ్‌నగర్ దాకా వచ్చేశాను... ఏదో కొత్తగా అనిపించింది.

ఏదో తేడా...

ఆ నా సైకిల్‌కు రెండువైపులా బెల్స్ లేవే ... దీని గేర్ కేస్ మోడల్ కూడా వేరు. ఈ మిర్రర్ ఏమిటి... టైర్లు కూడా కొత్తవి... ఇది నా సైకిల్ కాదు. తేలిపోయింది.

వెంటనే సైకిల్ వెనక్కి త్రిప్పాను. లక్కీగా సైకిల్ స్టాండువాడు గేటు బయట ఎవరితోనో రాబోయే సినిమాల గురించి, సినిమాలకి రాజకీయాలకు వుండే సంబంధా



ల గురించి జాతీయస్థాయి చర్చలో పడిపోయాడు.

నేను తేరిగ్గానే గుర్తుపట్టగలిగాను వాడిని.

'మిస్టర్ చూడు ఇందాక తీసికెళ్ళానే... ఈ సైకిల్ నాది కాదు' అదేమిటి సార్... నెంబర్ చూసుకున్నారు కదా'

'ఏమో... మారిపోయిందేమో' ఇప్పుడు

ఏం చేయమంటారు సార్. అంతా వెళ్ళిపోయారు కూడా'

'అది నిజమేననుకో...' నసుగుతూ వుండగా 'మీది కొత్తసైకిలా' వాడే అడిగాడు

'కాదు ఇదే కొత్తది నాది పాతదే కాస్త'

'మరెందుకు సార్ వర్రీ అవుతారు. ఇంతకంటే ఏ డొక్కుసైకిలో అయితే బాధపడాలి' జీవితసత్యం ఒకటి నాముఖాన పడేశాడు.

'నాది కాని వస్తువు నా దగ్గరుండటం మంచిది కాదు. రేప్పొద్దున్న ఆ సైకిల్ కోసం అతను వెతికితే నేను దొంగననుకుంటారు'

నా మాటలకి వాళ్ళు గట్టిగా నవ్వారు. నన్నో అమాయకపు పక్షిని చూసినట్టు చూశారు. ప్రయోజనం లేక ఇంటికొచ్చేశాను.

నాన్నగారు చాలా కోప్పడ్డారు. మనది కాని వస్తువు మన దగ్గర వుండకూడదని... ఉదయమే వెళ్ళి పోలీసు కంప్లయింట్ ఇచ్చిరమ్మని...

* * * * *

రాత్రి అంతా సైకిల్ గురించే ఆలోచన. ఉదయమే లేచి పోలీసు కంప్లయింట్ ఇవ్వడానికి వెళ్ళాను. ఇంటిదగ్గర స్టేషన్లో కాదని, సైకిల్ పోయిన జూరిస్‌డిక్షన్ వేరని ఆ స్టేషన్‌లో కంప్లయింట్ ఇవ్వాలనీ అనడంతో అక్కడికి వెళ్ళడం, ఎస్ఐతో మాట్లాడటం, వాడు ప్రశ్నలతో పీకి పాకం పట్టడం అయిపోయింది.

ఎస్ఐని కలవాలని వెయిట్ చేస్తున్న సమయంలోనే విషయం అడిగి తెలుసుకున్న కానిస్టేబుల్ "ఎందుకుసార్ కంప్లయింట్.. కార్లూ, స్కూటర్లూ పోతుంటేనే కేసులు తేలటంలేదు. సైకిల్ 'దొరుకుతుందా అదీ కాకుండా ఏదో ఒక సైకిల్ మీ దగ్గరవుంది కనుక మాట్లాడకుండా ఊరుకోవడం ఉత్తమం... బహుశా మీ సైకిల్ అతను తీసుకెళ్ళిపోయి వుంటాడు. నష్టమెవరికీ లేదు కదా"

అతను చెప్పినదాంట్లోనూ నిజముందనిపించింది. కానీ నాన్నగారు చాలా ఖచ్చితంగా చెప్పేశారు.

కంప్లయింట్ వ్రాసి ఎస్.ఐకి ఇచ్చాను. పోయిన సైకిల్ నెంబరు, దొరికిన సైకిలు నెంబర్ నోట్ చేసుకుని ఈ సైకిల్ ఇక్కడే వుంచండి అన్నాడు.

వాచీ చూసుకున్నాను. లాభంలేదు ఇంత ఈ టైములో ఆఫీసుకు వెళ్ళడం బావుండదు. అక్కడ్నుంచి ఆఫీసుకు ఫోన్ చేయడానికి పర్మిషన్ అడిగాను.

చేసుకోమన్నాడు... ఆఫీసుకు రావటంలేదని సి.ఎల్‌గా ట్రీట్ చేయమని, అప్లికేషన్ తరువాత ఇస్తానని చెప్పాను.

రిసీవర్ పెట్టేస్తూ జేబులోకి చేయిని పోనిచ్చాను. పర్స్‌తీసి చూశాను. చిల్లరలేదు. పదిరూపాయల నోటు ఎస్.ఐ ముందుపెట్టాను, ఫోన్‌కాల్ చేసుకున్నందుకు.

'థాంక్స్' చెప్పి పదీ జేబులో వేసుకున్నాడు.

'అలాగే వెళ్ళండి... మా శాయశక్తులా మీ సైకిల్‌కోసం ప్రయత్నం చేస్తాం' అంటూ బయటకు దారుకున్నాడు.

అతని ధోరణి నాకర్థమైపోయింది. చేసేదిలేక అలాంటిచోట చిల్లర ఆశించిన నా తెలివితక్కువ తనానికి తిట్టుకుని అమాయకపు పక్షిలా ఇంటిముఖాన పట్టాను.

* * * * *

ఆ సైకిల్ విషయం, కనుక్కోవడానికి కనీసం డజనుసార్లు పోలీసుస్టేషన్‌కువెళ్ళాను

నాలుగుసార్లు ఆఫీసుకు సెలవుపెట్టాల్సి వచ్చింది. నెలరోజులు గడిచిపోయాయి.

''ఏమైనా సరే ఈరోజున తేల్చుకోవాలి' ' అన్న పట్టుదలతో వెళ్ళాను. ప్రతిసారిలా కాకుండా కాస్తగట్టిగా మాట్లాడదామని రడీ అయ్యాను.

అయితే స్టాఫ్ ఎవరూ లేరు. ఎవరో మంత్రిగారొచ్చారని అంతా అక్కడికి వెళ్ళిపోయారని నిద్రమత్తులో వున్న ప్యూన్ చెప్పాడు.

నాలుగురోజుల తరువాత మళ్ళీ వెళ్ళాను కంప్లయింట్ తీసుకున్న ఎస్ఐ కాకుండా కొత్త ఎస్ఐ కనిపించాడు ఆ స్థానంలో. పాత అతనికి ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫరైనట్లు తెలిసింది.

విషయం తెలుసుకున్న కొత్త ఎస్ఐ అన్నాడు ''ఎందుకుసార్ అంత శ్రమపడతారు. ప్రతిచిన్న విషయానికి మమ్మల్ని ఇబ్బంది పెడతారు. మీరు కంప్లయింట్ ఇవ్వడం దాన్ని మేం ఫైల్ చెయ్యడం... మా ఇన్స్‌పెక్టర్‌తో అరాలు తీయడాలు, పెండింగ్‌లో వున్న కేసుల గురించి మేం ఎక్స్‌ప్లనేషన్సూ... మీరు జాగ్రత్తగా వుంటే ఇంత తలనొప్పి వుండేది కాదు కదా''


''ఇప్పుడు నన్నేం చేయమంటారు...''

''ఆ సైకిలే వుంచుకోవలసింది''

''ఆ పనే చేయదలుచుకుంటే ఇన్నాళ్ళు మీ స్టేషన్ చుట్టూ తిరగడం దేనికి''

పోగొట్టుకోవడం తేలిక... దక్కించుకోవడం కష్టం. గొప్ప స్టేట్‌మెంట్ నా ముఖాన పడేశాడు.

విరాకు పడ్డాడు.



కానిస్టేబుల్ని పిలిచి లోపలికి తీసికెళ్ళమని ఏదో ఎరేంజ్ చేయమని చెప్పాడు. అతను నన్ను లోపలికి తీసుకెళ్ళాడు.

అక్కడో పెద్ద షెడ్డు... నాలుగైదు టైర్లు లేనివి, చక్రాల్లేనివి... హాండిల్, సీటులాంటివేమీ లేని మరో డజను తుప్పుపట్టిన సైకిళ్ళు— చిల్లుపడ్డ బిందెలు, అల్యూమినియం గిన్నెలు, కాళ్ళులేని చెక్క కుర్చీలు, కోళ్ళులేని మంచాలు...

"సార్ వీటిలో ఏదో ఒక సైకిల్ పట్టుకెళ్ళండి" నాకు చాలా కోపం వచ్చింది. నాన్నగారు ఏమన్నాసరే ఆరోజున ఇచ్చేసిన సైకిల్ పట్టుకెళదామని అడిగాను.

"అది లేదని... వున్నవి ఇవేనని, ఇష్టమైతే తీసుకెళ్ళమని" ఏదో దయచూపిస్తున్నట్టు చెప్పాడు.

ఇవతలకొచ్చేసరికి ఎస్.ఐ నన్ను అక్కడున్న రిజిష్టర్లో సంతకం పెట్టమన్నాడు.

పైన ఉన్నదేమిటో చదివాను... పోయిన సైకిల్ దొరికిందని, కృతజ్ఞతలనీ సారాంశం.

"ఒకవేళ నా అసలు సైకిల్ దొరకకపోతే పోనీయండి. ఆ తరువాత ఇచ్చివెళ్ళిన సైకిలుండాలిగా... ఏమైంది" అడిగాను.

"ఏమో... ఏమైందో అప్పటి ఎస్.ఐ ఏవిధంగా అడ్జస్టు చేశాడో... అయినా ఆ విషయం వదిలేయండి" విసుగ్గా అంటూండగానే ఫోను మ్రోగింది.

"యస్ సార్"

"... ..."

"అలాగే సార్"

"... ..."

"రిస్టువాచీలు రెండున్నాయి సార్"

"... ..."

"అబ్బాయికా సార్"

"... ..."

"అలాగే సార్"

"నేను ఎలాగో అలా అడ్జస్ట్ చేస్తాను సార్"

"... ..."

"నేను ఇంటికి పట్టుకొస్తాను సార్"

"నమస్తే... వుంటాను సార్" రిసీవర్ క్రెడిల్‌మీద పెట్టేసాడు అతివినయంగా. అవతల వ్యక్తి కంఠం పై అధికారిది అని తెలిసిపోతోంది. నేను తీసుకోదల్చుకున్న సైకిల్ ఏమైవుంటుందో తేలిగ్గా ఊహించగలిగాను.

"ఏమిటంటారు... మీరు సంతకం చేస్తేగానీ కేస్‌క్లోజ్ చేయడానికి కుదరదు. ఆ తరువాత మీరు కోర్టుకు కూడా తిరగాల్సి వుంటుంది..."

వినగానే దడమొదలైంది. అప్పటికే వేస్టయిపోయిన చెప్పులు గుర్తొచ్చాయి.

పోయిన నా సైకిలు దొరికిందని ఒప్పుకుంటూ సంతకం చేసాను. ఎస్.ఐ రిజిష్టరు క్లోజ్ చేసాడు.

*

